JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 15-04-2026
Medchal - Malkajgiri । Wednesday 15-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 318
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 318 । Pages : 8 । ₹: 5



8 లో



# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

- మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్
- దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయని
- ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారు
- మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం
- డా అంబేద్కర్ కు సీఎం రేవంత్ నివాళి

**జయభేరి, హైదరాబాద్ :**

మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రోరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా... ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌పై మండిపడ్డారు.

మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారని... ఇప్పుడు అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారని అన్నారు. ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని... చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనని తెలిపారు. కులగణన చేస్తామని చెప్పామని... అలా చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే... తమ సీట్లను సాధించుకోవాలని చెప్పారు. అప్పుడే మన హక్కుల కోసం మాట్లాడగలమని.... ఈ విషయంలో మేధావులు ఆలోచన చేయాలని కోరారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన ...మిగతాది 2 లో

# మోదీకి ట్రంప్ ఫోన్ కాల్



- 40 నిమిషాల పాటు ఇరువురు నేతల సంభాషణ
- ఇరాన్, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఇంధన భద్రత, కీలక సముద్ర మార్గాల స్థిరత్వంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు
- హర్మూజ్ జలసంధిని తెరిచి, సురక్షితంగా ఉంచడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాము

**జయభేరి, న్యూఢిల్లీ:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు మంగళవారం రోజున అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. ఈ క్రమంలోనే ఇరువురు నేతలు దాదాపు 40 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ఈ సదర్భంగా మిడిల్ ఈస్ట్ లో వేగంగా మారుతున్న పరిస్థితుల గురించి కూడా మోదీ, ట్రంప్ చర్చించారు. ఇరాన్, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఇంధన భద్రత, కీలక సముద్ర మార్గాల స్థిరత్వంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ట్రంప్, మోదీల మధ్య మిడిల్ ఈస్ట్ లో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ఇక, ట్రంప్ తనకు ఫోన్ చేసిన విషయాన్ని ప్రదాని మోదీ ఎక్స్ వేదికగా తెలియజేశారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు (అమెరికా) డొనాల్డ్ ట్రంప్ నుంచి నాకు ఫోన్ వచ్చింది. ...మిగతాది 2 లో

# గులాబీ దళం రివర్స్ గేర్

BHARAT RASHTRA SAMITHI BRS భారత రాష్ట్ర సమితి To TELANGANA RASHTRA SAMITHI TRS తెలంగాణ రాష్ట్ర సమితి

- బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చే ఆలోచనలో కేసీఆర్..?
- 2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమ లక్ష్యంతో పార్టీని స్థాపించిన తర్వాత టీఆర్ఎస్ పేరు ప్రజల్లో బలంగా నాటుకుపోయింది
- ఈ నెల 25న పార్టీని ప్రకటించే అవకాశముందని సమాచారం రావడంతో బీఆర్ఎస్ కేడర్‌లో కొత్త చర్చ

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ పార్టీ మళ్లీ టీఆర్ఎస్‌గా మారుతుందా అనే అంశం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. వరుస ఎన్నికల్లో ఎదురైన పరాజయాలు, పార్టీ కేడర్ నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో అధిష్టానం కీలక నిర్ణయం తీసుకునే దిశగా కదులుతోందనే ప్రచారం వేగంగా విస్తరిస్తోంది. టీఆర్ఎస్ అనే పేరుతోనే ప్రజల్లో బలమైన గుర్తింపు ఏర్పడిందని, ఆ పేరును మార్చిన తర్వాతే పార్టీకి గడ్డుకాలం మొదలైందనే అభిప్రాయం పలువురు నేతలు బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే ఎన్నికల్లో తిరిగి బలపడాలంటే పాత పేరుకే మళ్లాలని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. 2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమ లక్ష్యంతో పార్టీని స్థాపించిన తర్వాత టీఆర్ఎస్ పేరు ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ...మిగతాది 2 లో



# బీఆర్ఎస్ హెచ్చరికతోనే సర్కార్ కళ్లు తెరిచింది

- రెండున్నరేళ్లు అంబేద్కర్ విగ్రహాన్ని బంధీ చేసిన కాంగ్రెస్ సర్కార్ పై విరుచుకుపడిన కేటీఆర్
- అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టిన కేటీఆర్
- అంబేద్కర్ అంటే మాటల్లో కాదు.. చేతల్లో ఉండాలి

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్లోని తెలంగాణ భవన్ నుండి భారీ కాన్వాయ్తో బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ముఖ్య నేతలు హుస్సేన్ సాగర్ తీరాన ఉన్న 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు ఘనంగా ...మిగతాది 2 లో

# క్వాంటం రంగంలో ఏపీ సరికొత్త అధ్యాయం



- దేశంలోనే తొలి రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**జయభేరి, గుంటూరు, ఏప్రిల్ 14 :**

క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలోనే తొలిసారిగా క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిన రాష్ట్రంగా ఏపీ ఘనత సాధించింది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదుపాయాలను మంగళవారం ప్రారంభించారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం రంగంలో రాష్ట్రం కీలక ముందడుగు వేసినట్లయింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన '1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ'తో పాటు, గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఉన్న '1క్యూ క్వాంటం ఫెసిలిటీ'ని సీఎం ప్రారంభించారు. ఈ రెండు కేంద్రాలు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించే టెస్ట్ బెడ్స్‌గా పనిచేస్తాయి. మైనస్ 273 డిగ్రీల ...మిగతాది 2 లో

# రోజా సెకండ్ ఇన్నింగ్స్



- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో మొండి చేయి చూపితే.. వెంటనే తమిళ రాజకీయాల్లో ఎంట్రీ

**జయభేరి, చెన్నై, ఏప్రిల్ 14 :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రోజా వేరే ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. ముఖ్యంగా తమిళ రాజకీయాలను ఒక ఆప్షన్ గా పెట్టుకున్నారు. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనను విస్మరిస్తే ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనే తెలంగాణలో తమ ప్రజాపాలన విధానమని పేర్కొన్నారు. రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ ప్రపంచ దేశాలకు చాటిచెబితే... ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని చెప్పారు. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారని తెలిపారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు. కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయని తెలిపారు. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు.

## మోదీకి ట్రంప్ ఫోన్ కాల్

వివిధ రంగాలలో మన ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని మేము సమీక్షించుకున్నాము. అన్ని రంగాలలో మా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. మేము పశ్చిమ ఆసియాలోని పరిస్థితి గురించి కూడా చర్చించాము. హర్మూజ్ జలసంధిని తెరిచి, సురక్షితంగా ఉంచడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పాము'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇరువును నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. ''మేమందరం మిమ్మల్ని ప్రేమిస్తున్నామని మీరు (మోదీ) తెలుసుకోవాలని నేను (ట్రంప్) కోరుకుంటున్నాను... అని ట్రంప్ ప్రధాని మోదీతో అన్నారు" అని సెర్గియో గోర్ చెప్పారు. ఈ ఏడాది నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఇది మూడో ఫోన్ సంభాషణ. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత పశ్చిమ ఆసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చిన తర్వాత ట్రంప్, మోదీల మధ్య రెండో సంభాషణ. ఈ ఇద్దరు నాయకులు మొదట ఫిబ్రవరి 2న వాణిజ్య ఒప్పందంపై పురోగతిని ప్రకటించడానికి మాట్లాడారు. ఆ తర్వాత మార్చి 24న పశ్చిమ ఆసియాలో తీవ్రమవుతున్న పరిస్థితిపై చర్చించడానికి మరోసారి ఫోన్‌లో సంభాషణ జరిపారు. తాజాగా ఇప్పుడు మరోసారి ఇరుదేశాల మధ్య సంబంధాలు, పశ్చిమాసియాలో పరిస్థితులపై మోదీ, ట్రంప్ చర్చించారు.

## గులాబీ దళం రివర్స్ గేర్

నీళ్లు, నిధులు, నియామకాల వంటి అంశాలతో ప్రజల్లో సెంటిమెంట్‌ను పెంచుకున్న ఆ పార్టీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి అధికారాన్ని నిలబెట్టుకుంది. టీఆర్ఎస్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే టీఆర్ఎస్ అనే స్థాయిలో ఆ బ్రాండ్ గుర్తింపు ఏర్పడింది. అయితే 2022 డిసెంబర్ 9న పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చుతూ జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టాలనే లక్ష్యంతో కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో పలు రాష్ట్రాల్లో పర్యటనలు చేసి రైతు అజెండాను ముందుకు తెచ్చారు. అయితే ఈ మార్పు తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారాన్ని కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడం వంటి పరిణామాలు పార్టీని వెనక్కి నెట్టాయి. ఉపఎన్నికల్లో కూడా ఆశించిన ఫలితాలు రాకపోవడం, కేడర్‌లో అసంతృప్తి పెరగడం గమనార్హం. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్ దూరమైందని, ప్రజలు పార్టీ నుంచి దూరమయ్యారనే అభిప్రాయం బలపడుతోంది. గులాబీ జెండా, టీఆర్ఎస్ పేరుతో ఉన్న అనుబంధాన్ని కోల్పోవడం రాజకీయంగా నష్టమేనని పార్టీ లోపలే చర్చ జరుగుతోంది.

ఇక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరింత వేడెక్కించాయి. మంచిర్యాల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పేరు మార్పుపై కేడర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఎప్పుడూ ఈ అంశంపై మాట్లాడని ఆయన ఇప్పుడు స్పందించడం వెనుక వ్యూహం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీని తిరిగి టీఆర్ఎస్‌గా మార్చితే జాతీయ రాజకీయాల నుంచి కొంత దూరం కావాల్సి వస్తుందని, రాష్ట్ర రాజకీయాలపైనే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న వివిధ పరిణామాలు కూడా పార్టీకి ప్రతికూలంగా మారాయి. అగ్ని ప్రమాదాలు, అకాల వర్షాలు, పలు వివాదాలు, నిరుద్యోగ సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై వచ్చిన విమర్శలు ప్రజల్లో వ్యతిరేకతను పెంచాయి. ఎన్నికల్లో వరుస పరాజయాలు పార్టీపై ప్రభావం చూపించాయి.

జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని చేసిన ప్రయత్నాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పార్టీ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇదే సమయంలో కవిత కొత్త పార్టీ స్థాపనకు సిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తోంది. ఈ నెల 25న పార్టీని ప్రకటించే అవకాశముందని సమాచారం రావడంతో బీఆర్ఎస్ కేడర్‌లో కొత్త చర్చ మొదలైంది. ఒకవైపు కొత్త పార్టీ ప్రభావం, మరోవైపు ఇప్పటికే ఉన్న అసంతృప్తి మధ్య పార్టీ పేరు మార్పు అంశాన్ని ముందుకు తెచ్చారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేడర్ దృష్టి మరల్చేందుకు లేదా ఐక్యతను కాపాడేందుకు ఈ వ్యూహం ఉపయోగపడుతుందా అనే కోణంలో కూడా విశ్లేషణ జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా మారుతుందా లేదా అనే ప్రశ్నకు సమాధానం పార్టీ అధినేత తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. పేరు మార్పు ద్వారా పాత వైభవాన్ని తిరిగి సాధించగలదా? లేక ఇది కేవలం వ్యూహాత్మక చర్చగానే మిగిలిపోతుందా? అన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు రానుంది.

## టీటీడీకి రూ.27 లక్షలు విరాళం

జయభేరి, తిరుమల :

కర్ణాటక రాష్ట్రం బెలగావికి చెందిన ప్రవీణ్ సోన్వాల్కర్ మంగళవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా సుభాష్ సోన్వాల్కర్ అనే భక్తుడు కూడా శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు.

# నెక్స్ట్ ఏంటీ..?



ఇస్లామాబాద్‌లో జరిగిన అమెరికా-ఇరాన్ చర్చలు ఏ ఒప్పందం లేకుండానే ముగియడంతో, రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక శాంతి సాధ్యమా అనే ప్రశ్నలు మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి.ఇరాన్, అమెరికా మధ్య చర్చలు విఫలం కావడంతో.. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మరోసారి ఇరాన్‌లోని అణు మౌలిక సదుపాయాలపై దాడులకు తెగబడే ప్రమాదం ఉంది. అదే జరిగితే యుద్ధం మరింత తీవ్రతరం అవుతుంది. హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు తిరిగి ప్రారంభం కాకపోతే.. చమురు రవాణా నిలిచిపోయి ఇంధనం ధరలు భారీగా పెరిగి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుంది. యుద్ధం పూర్తి స్థాయికి చేరడం, ఆర్థిక ఆంక్షల కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది.ఇస్లామాబాద్ చర్చలు విఫలం కావడంతో.. పశ్చిమాసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. అయితే చర్చల్లో మధ్యవర్తి పాత్ర పోషిస్తున్న పాకిస్థాన్.. పూర్తి స్థాయి యుద్ధం జరగకుండా తన వంతు ప్రయత్నాలు చేయొచ్చు. వాస్తవానికి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తోంది ఇస్లామాబాద్ అయినప్పటికీ.. తెర వెనుక చక్రం తిప్పుతోంది చైనానే అని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ యుద్ధం వల్ల చైనాకు కొన్ని లాభాలు ఉన్నప్పటికీ.. దాడులు తీవ్రమైతే మాత్రం బీజింగ్‌కు ఆర్థికంగా భారీ నష్టాలు వచ్చే పరిస్థితి ఉంటుంది. దీంతో యుద్ధం తీవ్రతరం కాకుండా చూడటానికి చైనాతో పాటు రష్యా ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తి పాత్రను పాకిస్థాన్ పోషించడంతో.. ఆ దేశ ప్రతిష్ఠ పెరిగిందని.. విశ్వగురువుగా చెప్పుకొనే మోదీ మాత్రం సైలెంట్ అయిపోయారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేశాయి. భారత్ ఏకాకిగా మారితే.. పాకిస్థాన్ అందరి ప్రశంసలు పొందుతోందనే విమర్శలు వచ్చాయి. అయితే ట్రంప్ మొండి వైఖరి గురించి భారత్‌కు బాగా తెలుసు. అమెరికా అధ్యక్షుడి చేతిలో పాక్ పాలకులు కీలుబొమ్మగా మారిన వైనం కూడా అందరికీ తెలుసు. మరోవైపు తమ అగ్రనేతలను కోల్పోవడంతో ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. అణు కార్యక్రమం నుంచి పూర్తిగా వైదొలగడానికి ఇరాన్ ఏమాత్రం సుముఖంగా లేదు. అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మందికిపైగా ఉన్న తమ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత మోదీ సర్కారుపై ఉంది. ఇదే భారత ప్రభుత్వం తొలి ప్రాధాన్యం కూడా. అదే సమయంలో యుద్ధం వల్ల తలెత్తే నష్టాలు కూడా భారత్‌కు బాగా తెలుసు. అందుకే చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికా, ఇరాన్‌లను పదే పదే కోరింది. కానీ తన ప్రయోజనాలు, ఇరు వర్గాల మొండి వైఖరి, తెర వెనుక చైనా పాత్రను దృష్టిలో ఉంచుకొని మధ్యవర్తిత్వం వహించడానికి భారత్ ముందుకు రాలేదు. అయితే ఇప్పుడు పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం వస్తే మాత్రం భారత్ మరింత చొరవ తీసుకునే అవకాశం లేకపోలేదు.పాకిస్తాన్ ప్రభుత్వ అధికారులు చర్చలకు ముందు ఆశాజనక వ్యాఖ్యలు చేశారు.ఇతరుల కంటే భిన్నంగా తమపై రెండు పక్షాలకూ నమ్మకం ఉందని అన్నారు. అమెరికా ప్రతినిధి బృందం నాయకుడు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఆశావహంగా ఉన్నప్పటికీ, ఆదివారం రాత్రి వరకు జరిగిన చర్చల అనంతరం, ఎటువంటి ఒప్పందం కుదరలేదని ప్రకటించారు.ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు 1979 విప్లవం తర్వాత ఇరాన్-అమెరికా మధ్య జరిగిన అత్యున్నత స్థాయి చర్చలు"అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ఎప్పుడూ కఠినమైన భాషను ఉపయోగించారు. ఇరాన్ ఓడిపోయిందని, ఇరాన్ లొంగిపోవాలని ట్రంప్ అన్నారు. వాన్స్ కూడా అదే తరహాలో "తెహ్రాన్ మా షరతులకు అంగీకరించాలి" అని అన్నారు. ఎందుకంటే సంఖ్యలను పరిశీలిస్తే, ఇరాన్ గణనీయంగా సైనికులను కోల్పోయింది. వారి అగ్రనేతలు పలువురు హత్యకు గురయ్యారు" అని లీస్ అన్నారు.అయితే ఇరాన్ అలాంటి హెచ్చరికలకు లొంగే అవకాశం చాలా తక్కువని, లొంగిపోయేందుకు సిద్ధపడి ఇస్లామాబాద్ చర్చలకు రాలేదని డూసెట్ చెబుతున్నారు. తాను ఈ యుద్ధంలో ఓడిపోయాననుకుని ఇస్లామాబాద్‌కు రాలేదు, నిజానికి తాను గెలుస్తున్నానని ఇరాన్ భావిస్తోంది. తనకు బలమైన స్థానం ఉందని నమ్ముతోంది. ఇంకా ప్రతిదాడులు చేస్తూనే ఉంది. హార్మూజ్ జలసంధిని కూడా వ్యూహాత్మకంగా ఉపయోగించగలిగింది" అని లీస్ వివరించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చల నుంచి కొన్ని సానుకూల సంకేతాలు ఉన్నాయని బ్రిటన్ మాజీ ఇరాన్ రాయబారి నికోలస్ హాప్టన్ భావిస్తున్నారు ."రెండు పక్షాలు ఈ చర్చలను నిర్మాణాత్మకంగా నిర్వహించినట్టుగా కనిపిస్తోంది. రోజులో చాలా సేపు చర్చించారు. ఆ చర్చల్లో సాంకేతిక వివరాలు, అలాగే సాధారణ అంశాలపై కూడా లోతైన చర్చలు జరిగాయి" అని ఆయన అన్నారు.ఇస్లామాబాద్‌లో "గరిష్ఠ డిమాండ్లు" పెట్టుకున్నప్పటికీ, వాటి మధ్య చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరుగుతాయని రెండు పక్షాలు భావిస్తున్నట్టుగా ఆయన చెబుతున్నారు."చివరికి ఒప్పందం అంటూ కుదిరితే, అది 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కుదుర్చుకున్న ఒప్పందం కంటే కూడా మరింత సంక్లిష్టంగా, కొత్త అంశాలతో ఉండే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.ఈ దఫా చర్చల్లో ఇరాన్ విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైందని విమర్శిస్తూ, ఇంకా మరిన్ని చర్చలకు అవకాశం ఉందని ఈ చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధి బృందం అధిపతి మొహమ్మద్ గాలిబాఫ్ ట్వీట్ చేసినట్టు నాజీ రాశారు.అలాగే ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య పాకిస్తాన్ ద్వారా పరోక్ష చర్చలు కొనసాగుతున్నాయని సమాచారం లభించింది. అయితే వీటిని అధికారికంగా అమెరికా లేదా ఇరాన్ ధ్రువీకరించలేదు.ప్రస్తుతం వాషింగ్టన్ నుంచి వెంటనే ఉద్రిక్తతలు పెరుగుతాయా అనే ప్రశ్నకు కొంతమంది నిపుణులు లేదు అని సమాధానమిస్తున్నారు. గ్లోబల్ ట్రేడ్‌పై ప్రభావం, నాయకత్వ నిలకడ, యురేనియం నిల్వలు వంటి అంశాల కారణంగా ఇరాన్ ఇంకా అమెరికాపై ప్రభావం చూపే బలమైన స్థితిలోనే ఉందని వారంటున్నారు.బంతి ఇప్పుడు అమెరికా కోర్టులో ఉంది" అని కూడా పేర్కొంది."కఠినమైన ఒత్తిడి ఇరానీయులను తాము తప్పనిసరిగా షరతులు అంగీకరించాల్సిన స్థితికి తీసుకురాలేకపోయిందనే వాదన వినిపిస్తోంది.చర్చలు విఫలమవడంతో ట్రంప్ నేవల్ బ్లాకేడ్‌కు ట్రంప్ సిద్ధమయ్యారు. ఇది జనవరిలో వెనెజ్వెలా మాజీ అధ్యక్షుడు నికొలాస్ మదురోను తొలగించే ముందు కనిపించిన పరిస్థితితో సమానమని అంటున్నాయి.దీనికి సూచనగా.. చర్చలు కొనసాగుతున్న సమయంలోనే హార్మూజ్ జలసంధిని తెరవడానికి సురక్షిత సముద్ర మార్గం ఏర్పాటు చేయడం గురించి అమెరికా సైనిక ఉన్నతాధికారి ఒకరు ప్రకటన విడుదల చేశారు.ఇది అమెరికా మళ్లీ ఇరాన్‌పై బాంబింగ్ మొదలుపెట్టడంతో జరుగుతుందా అన్న దానిపై స్పష్టత లేదు.మొదటిది, ఇలాంటి యుద్ధాన్ని తిరిగి మొదలుపెడితే అమెరికా ప్రజలకు నచ్చని పరిస్థితి ఏర్పడవచ్చు.దీర్ఘకాలిక యుద్ధం వల్ల దేశంలో పరిస్థితులు ఎలా ప్రభావితమవుతాయో ట్రంప్‌కు తెలుసు. ముఖ్యంగా నవంబర్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ధరలు ఇంకా పెరిగితే అది రాజకీయంగా సమస్య అవుతుంది. రెండవ విషయం ఏంటంటే ఈ విధానం పనిచేయదు. ఎందుకంటే ఇరాన్ ప్రతిదాడి చేస్తుందని డూసెట్ చెప్పారు.

## బీఆర్ఎస్ హెచ్చరికతోనే సర్కార్ కళ్లు తెరిచింది

నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశాయి. నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే అంబేద్కర్ సిద్ధాంతమే పునాదిగా తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన పేర్కొన్నారు. కేవలం మాటల్లోనే కాకుండా, చేతల్లో గౌరవం చూపించాలనే ఉద్దేశంతో దళిత బిడ్డల కోసం 1000 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామని, అలాగే రాష్ట్ర సచివాలయానికి బాబాసాహెబ్ పేరు పెట్టి గౌరవించుకున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2024 నుండి ఈ విగ్రహాన్ని బందీగా మార్చారని, తాము 14 రోజుల క్రితం హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం ఇప్పుడు అధికారికంగా వేడుకలు నిర్వహిస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇచ్చి ఆదుకుంటే, కాంగ్రెస్ మాత్రం రూ. 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి కనీసం 12 పైసలు కూడా విదిల్చలేదని విమర్శించారు. చేవెళ్ళ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్తో పాటు బీసీ, రైతు డిక్లరేషన్లను అమలు చేసే వరకు అంబేద్కర్ స్ఫూర్తితో తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. నివాళుల కార్యక్రమం అనంతరం కేటీఆర్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు విగ్రహం కింది భాగంలో ఉన్న భవనంలోని మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ జీవిత విశేషాలను మరియు చారిత్రక ఘట్టాలను వారు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోజా సెకండ్ ఇన్నింగ్స్

వెంటనే తమిళ రాజకీయాల్లోకి వెళ్లాలని ఆలోచన చేస్తున్నట్టు ఉన్నారు. ఎందుకంటే రోజాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వచ్చే ఎన్నికల్లో సీటు దక్కుతుందా లేదా అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నగరిలో టిడిపి పట్టు బిగిస్తోంది. మరోవైపు రోజా నాయకత్వాన్ని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. అందుకే టిక్కెట్ల విషయంలో ఎటువంటి మొహమాటాలకు పోదలుచుకోలేదు జగన్మోహన్ రెడ్డి.మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు నగిరి టికెట్ వస్తుందా లేదా అన్న అనుమానాలు వెంటాడాయి. అయితే ఈసారి తప్పకుండా రోజాను తప్పించాల్సిందేనని ఆ జిల్లాకు చెందిన సీనియర్ మాజీమంత్రి ఒకరు గట్టిగానే జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు టికెట్ వద్దని వారించారట. కానీ ఆమెకు టికెట్ ఇవ్వకపోతే నెగిటివ్ ఫీడ్బ్యాక్ వెళుతుందని భావించి జగన్మోహన్ రెడ్డి ఆమెకు టికెట్ ఇచ్చారు. అయితే ఈసారి మాత్రం ఆమెకు టికెట్ లేదని స్పష్టంగా తెలుస్తోంది. అందుకే సెకండ్ ఆప్షన్ గా రోజా తమిళ రాజకీయాలను ఎంపిక చేసుకున్నారు. తాజాగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డిఎంకె తరఫున ప్రచారం చేస్తున్నారు రోజా. ఇదంతా ముందు చూపులో భాగమేనని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రోజా భర్త సెల్వమణి తమిళ దర్శకుడు. అక్కడ సినిమా రంగంతో పాటు రాజకీయ రంగాల్లో ఆయనకు పరిచయాలు ఎక్కువ. రోజా సైతం తమిళనాడులో నటిగా గుర్తింపు పొందారు. ఆమె ఆది నుంచి సీఎం స్టాలిన్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు. ఆమెను స్టాలిన్ సోదరిగా చూస్తారు. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో మొండి చేయి చూపితే.. వెంటనే తమిళ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వాలని రోజా భావిస్తున్నారట. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం భిన్నంగా ఆలోచిస్తోంది ఆమె విషయంలో. ఒకవేళ పార్టీలో కొనసాగితే కొనసాగని.. లేకుంటే వెళ్లిపోని అని సింపుల్ గా తీసుకుంటుందట. పైగా ఏపీ రాజకీయాలతో విసిగిపోయిన రోజా.. సెకండ్ ఇన్నింగ్స్ తమిళ రాజకీయాలు అని పొలిటికల్,సినీ వర్గాల్లో ఒక చర్చ నడుస్తోంది. చూడాలి ఆమె ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో..

## క్వాంటం రంగంలో ఏపీ సరికొత్త అధ్యాయం

సెల్సియస్ అత్యంత శీతల ఉష్ణోగ్రత వద్ద పనిచేసేలా వీటిని రూపొందించారు.ఈ కొత్త సదుపాయాలతో అమరావతి క్వాంటం వ్యాలీకి ఇప్పుడు క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి, సర్టిఫై చేసే సామర్థ్యం లభించింది. క్వాంటం కంప్యూటర్ పరికరాలు తయారు చేసే కంపెనీలకు, పరిశోధకులకు, విద్యార్థులకు, నిపుణులకు ఈ టెస్ట్ బెడ్స్ ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్, డీఎస్టీ ప్రతినిధులు, వివిధ క్వాంటం కంపెనీల అధిపతులు, ఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సింపుల్గా చెప్పాలంటే ఇప్పుడు మనం వాడుతున్న కంప్యూటర్ ల కంటే చాలా అడ్వాన్స్డ్ గా పనిచేసే కంప్యూటర్ నే క్వాంటం కంప్యూటర్ అంటారు. ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లు ప్రాసెసింగ్ పరంగా 0,1 బైనరీల లో డేటాను ప్రాసెస్ చేస్తాయి. కానీ క్వాంటం కంప్యూటర్ అనేది ఆ రెండిటితోపాటు వాటి మధ్య ఉండే క్యూబిట్స్ (క్వాంటం బిట్స్ ) స్థాయిలో ప్రాసెస్ చేస్తుంది. దీనివల్ల కలిగే ప్రధానమైన ప్రయోజనాలు ఇవే.

1) డేటా ప్రాసెసింగ్ మరింత ఖచ్చితత్వంతో జరుగుతుంది
2) మామూలు కంప్యూటర్ లకంటేచాలా వేగంగా పనిచేస్తుంది
3) డేటాను మరింత సురక్షితంగా ఉంచగలుగుతుంది అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుందని చంద్రబాబు చెబుతున్నారు.. గన్నవరంలోని మేధా టవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటు అవుతున్న 1S, 1 కQ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను అయన ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది.మేధాటవర్స్ లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి.

ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్ లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్ లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్ ను ఏర్పాటు చేసింది.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్ ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి.

# అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ కృషి చేయాలి

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 :**



డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు,నేతలు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డు భద్రతలో భాగంగా అవగాహన కల్పించడం కోసం పోలీసు అధికారులు,సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ రూపకర్తగా, సామాజిక న్యాయానికి మార్గదర్శిగా,అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు డాక్టర్ అంబేద్కర్ అని కొనియాడారు. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, విద్యను ఆయుధంగా తీసుకుని ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించి, భారతదేశానికి గొప్ప దిశానిర్దేశం చేశారన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించడం ఆయన గొప్ప కృషి




అని,సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు, కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం ఎన్నటికీ మరువలేనిదన్నారు. విద్య పొందండి, సంఘటితమవండి, పోరాడండి అనే ఆయన సందేశం నేటి యువతకు మార్గదర్శకమని,ప్రభుత్వం కూడా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలు,దళితులు,బీసీల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని చదువులో ముందుండాలని, సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్,వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచంద్రంతో పాటు కౌన్సిలర్లు కాటబత్తిని స్వప్నఆంజనేయులు, పెల్లి మెలి లావణ్యశ్రీధర్ గౌడ్,బోడ రాధసురేష్,కర్రె మాధవిప్రవీణ్,బూడిద మధు,పేరబోయిన సత్యనారాయణ, బబ్బూరి శ్రీధర్, యాదగిరిగుట్ట డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సిఐలు బాస్కర్,శంకర్,కృష్ణ, ఎస్ఐ రూపా శ్రీ, తహసీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, మున్సిపల్ కమీషనర్ లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


- అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 :**

అగ్నిప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి కె.మధుసూదన రావు పాల్గొని అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఆయన సూచించారు. వారోత్సవాల సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు, మాక్ డ్రిల్స్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అబ్దుల్ హమీద్, మధుకర్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు

- ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఘన నివాళులు



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 14 :**

తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ పొదిలా రవికుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ సోమల వెంకటేశం, సబ్ ఇన్స్పెక్టర్ తఖియోద్దీన్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు అరిగే మైపాల్ లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, వార్డు సభ్యులు నజీరుద్దీన్, కరుణాకర్, జాన్సన్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొరెడ్డి మహిపాల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శైలజ, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, బండారి యాదగిరి, కసరబోయిన గోపాల్, పాముల రాజు, కోట జహంగీర్, అశోక్, జిపిఓ కుమార్, సర్వేర్ శ్రీనివాస్, కోట సురేష్, భూక్య లచ్చిరాం, జింకల ఎల్లేష్ యాదవ్, పట్నం శ్రీనివాస్, కొండ హరినాథ్, పోలీస్ శాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్టు షాపులను నిషేధిస్తూ తీర్మానం

- సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 14 :**

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధించడంతో గ్రామస్తులంతా హర్షం ప్రకటిస్తున్నారు. గ్రామస్తులు కొంతమంది మద్యానికి బానిసై సంపాదించిన డబ్బులు అనేక కుటుంబాలు వివిధ పడుతున్నాయి దీంతో పాటుగా ఉదయం నుండే మద్యానికి అలవాటు వడినవారు. రోజంతా మద్యం సేవిస్తూ గొడవలు పడుతుండడంతో గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు నెలకొంటున్నాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మన్నిపు రజిత తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మద్యానికి అలవాటు పడి చాలా కుటుంబాల్లో కలతలు వచ్చి కుటుంబం ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. అలా జరగకుండా వారి కుటుంబాల్లో సంతోషం వెల్లి విరియాలన్నదే నా కోరిక అని తెలిపారు. అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ నిర్ణయానికి గ్రామంలోని ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మెండు రామ్మోహన్ రెడ్డి, పండుగ జంగీర్, గడ్డం నరసింహులు, సామల శ్రీను, గడ్డమీది బాలకృష్ణ, నాగారం కర్ణాకర్, యువకులు గుంటిపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ ను సన్మానించిన ఎమ్మెల్యే

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 14 :**

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గడిపే ఇంద్రయ్యను మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సన్మానించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఉపాధి హామీ పనిలో అత్యధికంగా ఎన్.ఎం.ఎం.ఎస్ ద్వారా హాజరు పంపుతూ అత్యధిక కూలీలతో పనిచేసి జిల్లా టాపర్గా నిలిచినందుకు ఫీల్డ్ అసిస్టెంట్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే పిఆర్ఓ ఆదిమూలం సురేష్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ బుల్లెట్ రైడ్

- బుల్లెట్ నడిపిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలంలో మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుల్లెట్ బండి నడిపి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలలో ఎమ్మెల్యే జిఎంఆర్ బుల్లెట్ నడిపి కొత్త జోష్ నింపారు. పోలీసులు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై హెల్మెట్ ధరించి కాసేపు బుల్లెట్ బండి నడిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ బుల్లెట్ బండి నడపడంతో అందరూ ఆయనను ఆసక్తిగా గమనించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే జిఎంఆర్ బుల్లెట్ బండి నడుపుకుంటూ అందరితోపాటు వెళ్లారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

- వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలి.




**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 14 :**

ప్రజలలో రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై తక్యుద్దీన్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అరైవ్, ఆలైవ్ రోడ్డు భద్రత అనే అంశంపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత బాధ్యతాయుత డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యం పై అవగాహన కల్పించినట్టు తెలిపారు. అనంతరం ప్రజలతో రోడ్డు భద్రతా పై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీత రాజు, ఉపసర్పంచ్ ధరావత్ మంగ్యా నాయక్, అడ్వకేట్ గంధం నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అలుగుపోస్తున్న గుండ్లపల్లి నల్లచెరువుకు ప్రత్యేక పూజలు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట మున్సిపల్ పట్టణ పరిధిలోని నల్లచెరువు నిండి అలుగుపోస్తుంది. మంగళవారం నల్లచెరువు దగ్గర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలతో గుండ్లపల్లి నల్లచెరువు నిండడం వల్ల యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాన మురికి కాలువ ప్రక్షాళనవుతుందని, స్వచ్ఛమైన కాలువగా మారుతుందని తెలిపారు. దీంతో యాదగిరిగుట్ట పట్టణంలోని పరిశుభ్రత పెరుగుతుందని,ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గోదావరి జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపుతున్నామని,ఎండాకాలంలో కూడా చెరువులు జలకళను సంతరించుకున్నాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో సాగు,తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్,వైస్ చైర్మన్ బరిగె రమ్య రామచంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు కాటబత్తిని స్వప్న ఆంజనేయులు ,బబ్బూరి శ్రీధర్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, బూడిద మధు, పేరబోయిన సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, కాంగ్రెస్ నేతలు జనగాం ఉపేందర్‌రెడ్డి,జీవన్ రెడ్డి, బందారపు భిక్షపతి,గుండు నర్సింహ్మా,అరుణ్,సలాం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగితే ఊరుకోం

- యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ కు వినతిపత్రం అందజేసిన సిపిఐ నేతలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రతిష్టకు, భక్తుల మనోభావాలకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదని యాదగిరిగుట్ట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్ అన్నారు. ఇటీవల కాలంలో యాదాద్రి దేవస్థానంలో పలుశాఖల అధికారులపైన వివిధ అంశాల్లో మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయని, వాటిపై ఎలాంటి చర్యలను ఆలయ అధికారులు, ప్రభుత్వాధికారులు తీసుకోవడం లేదని,వెంటనే వచ్చిన కథనాలపై విచారణ జరపాలని యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

మంగళవారం యాదగిరిగుట్ట ఆలయ కథనాలపై ఆలయ ఈవోకు సీపీఐ పార్టీ పక్షాన వినతిపత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ నిర్వాహణలో అధికారులతో జరుగుతున్న అక్రమాలంటూ మీడియాలో దేవాలయం, ఉద్యోగులు, టెండర్లకు సంబంధించి అనేక వార్తా కథనాలు వస్తున్నాయని,ఈ రకంగా తరచూ దేవాలయం జరిగిన విషయాలపైన వార్తలు కథనాలు రావడం వలన భక్తుల అనేక అపోహలు ఆందోళన ఏర్పడి ఆలయ ప్రతిష్టకు భంగం కలుగుతుందని అన్నారు. ఆలయ ఎలక్ట్రికల్ ఏఈ అంజయ్య వయస్సు 73 సంవత్సరాలు అయినా ఇంకా ఉద్యోగంలో కొనసాగుతున్నాడని వార్తలు వస్తున్నాయని, ఎలక్ట్రికల్ ఏఈ అనేది చాలా ముఖ్యమైన టెక్నికల్ పోస్టు అని,ఇలాంటి విషయంలో తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే టెండర్లు,గోదాంలో పకోడీలు తయారీ వంటి వాటితో దేవాలయం ఆదాయానికి నష్టం జరిగే విధంగా ఉందని అన్నారు. ఈ రకంగా నిత్యం ఏదో ఒక వార్తలు వస్తున్నందున దేవాలయ ప్రతిష్టకు భంగం కలుగుతుందని అన్నారు. ఒకవైపు భక్తులు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఇబ్బందులు పడుతుంటే ఇలా వార్తలు రావడం వలన భక్తుల మనోభావాలు దెబ్బతినడం కాకుండా ప్రతిష్టకు భంగం కలుగుతుందని ఇలాంటివి జరగకుండా వీటన్నిటి పైన సమగ్ర విచారణ జరిపించి అవినీతి అక్రమాలు జరిగితే దేవాలయం నష్టం జరిగితే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆలయ ప్రతిష్ట, భక్తుల మనోభావాలు కాపాడేందుకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య,పట్టణ కార్యవర్గ సభ్యులు కోక్కల రవీందర్, ఆరె పుష్ప,పాకాలపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం

- అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం
- డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ సలహాదారు రమేష్ కమల
- బోధించు సమీకరించు పోరాడు ఆయన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం
- సీనియర్ జర్నలిస్ట్ సంకసర్ల సువర్ణ

జయభేరి, లోత్కుంట :




లోత్కుంటలోని డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ కార్యవర్గ సభ్యులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి డా. బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కరైట్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గుజారి నవీన్ కుమార్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ గారు మహార్ కులంలో జన్మించి, చిన్ననాటి నుంచే అనేక అంటరానితనం, వివక్షను ఎదుర్కొన్నారని తెలిపారు. ఆ అనుభవాలే ఆయనను కులవ్యవస్థపై పోరాడేలా ప్రేరేపించాయని అన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ కొలంబియా యూనివర్సిటీ మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి డాక్టరేట్ పొందారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ప్రధాన శిల్పిగా డా. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసి, విద్య, చట్టపరమైన సంస్కరణల ద్వారా దళితుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. అలాగే సమానత్వం, న్యాయం కోసం రాజ్యాంగంలో ఆర్టికల్ 17 వంటి రక్షణలు ఏర్పాటు చేసి, "ఎడ్యుకేట్, అజిటేట్, ఆర్గనైజ్" అనే నినాదం ద్వారా అణగారిన వర్గాలకు రాజకీయ స్వరాన్ని అందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని, తమ మేసయ్య అయిన బాబాసాహెబ్ డా. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటించి, ఆయన వారసత్వం, సామాజిక న్యాయం పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ సలహాదారు రమేష్ కమల మాట్లాడుతూ, డా. అంబేద్కర్ జీవితం సులభం కాదని, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. దళితుల కోసం ఆయన దేవుడికంటే గొప్పవారని, బాబాసాహెబ్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజ్, కలావతి, కె.ఎ. లక్ష్మి, సీనియర్ జర్నలిస్ట్ సంకసర్ల సువర్ణ, టీ.మధుకర్, ఎస్.రామేశ్వర్, ఎస్. శ్రామిల్ కుమార్, ఎస్. వినోద్, రమేష్ కమల, ఎస్. మల్లేష్, డా. మురళి, ఎం. నరేందర్, డా. నవీన్ రాజ్, సి. సురేష్, వై. మల్లేష్, కె.ఎం. సురేష్, కె.ఎన్. లక్ష్మణ్ రావు, మగేంద్ర, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రయాణికుల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- భూత్పూర్, అమిస్తాపూర్ లలో ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక

జయభేరి, దేవరకద్ర :

ప్రయాణికులు సురక్షితంగా గమ్యం చేరాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్, అమిస్తాపూర్ లలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహనతో పాటు ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. ప్రధానంగా బైకర్స్ ఖచ్చితంగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వాటి వల్ల గణనీయంగా ప్రమాదాలను తగ్గించ వచ్చన్నారు. పోలీస్ శాఖ వారు ముఖ్యంగా మైనర్ల డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వారు రోడ్డు భద్రతకు సంబంధించి నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన బైక్ ర్యాలీలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూఎస్ ట్రేడ్ డీల్ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన ఇందిర పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్, మాజీ ఎంపీపీ శేఖర్ రెడ్డి, భూత్పూర్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్రోజ్ లతోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, మునిసిపాలిటీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా గిరిజన ఉద్యోగ సంఘం అంబేద్కర్ జయంతి వేడుకలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ లో మంగళవారం జిల్లా గిరిజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ జాతికి చేసిన సేవలను ఉద్దేశించి జ్ఞానం మనిషిని గొప్పవాడని చేస్తుందని చెప్పిన మహానుభావుడు అని అన్నారు. సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహా నేత, అణగారిన వర్గాలకు ఆశా కిరణం భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అని ఆయన అన్నారు. విద్యనే ఆయుధంగా తీసుకొని సమాజంలో మార్పు తీసుకువచ్చిన మహానుభావుడు ఆయన అని అన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే విలువలను మనకు నేర్పిన గొప్ప మేధావి అంబేద్కర్ అని అన్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమే అని నిరూపించిన ప్రేరణాత్మక వ్యక్తి ఆయన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు గంగారం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ రాథోడ్, జిల్లా గిరిజన ఉద్యోగుల అసోసియేట్ అధ్యక్షుడు గంగ్యా నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతు నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు బహదూర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శంకర్ నాయక్, జిల్లా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు శంకర్, టిఎన్జీవో ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్ లతోపాటు నాగరాజు, రవి నాయక్, గిరిజన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులను పరిశీలించిన సర్పంచ్ యుగంధర్ రెడ్డి



జయభేరి, కొండ మల్లేపల్లి :

మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని డ్రైనేజ్ పనులను 8.10 వార్డులలో పనులను పరిశీలించిన సర్పంచ్ యుగంధర్ రెడ్డ ముఖ్యంగా కొండ మల్లేపల్లి డ్రైనేజీ సమస్యతో వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదురవుతాయి అని తెలుసుకొని దేవరకొండ రోడ్డు రైస్ మిల్ ఎనక భాగాన డ్రైనేజీ పనులు కొన్ని రోజుల నుండి సర్పంచి యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి వార్డు ప్రజలు సర్పంచ్ తో మాట్లాడుతూ గత పాలకులు చేయలేని పనులు ఎన్నిసార్లు వారి దృష్టికి తీసుకెళ్లిన స్పందించకపోవడం చాలా బాధగా ఉండేదని అని అన్నారు మీరు వచ్చిన తర్వాత ఇక్కడ కంప చెట్లు పందుల కోతుల కుక్కలు లేకుండా చేశారని అన్నారు మరియు ఇప్పుడు డ్రైనేజీ పనులు ప్రారంభించినందుకు సర్పంచ్ కి మా కాలిని వాసుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు సర్పంచ్ మాట్లాడుతూ ఇక్కడ 8.9.10 వార్డులలో కాకుండా మిగతా వార్డులలో మొత్తం డ్రైనేజీ పనులను శాశ్వతంగా పరిష్కార చేస్తానని అన్నారు మన కొండ మల్లేపల్లి ని ఆదర్శ కొండమల్లేపల్లిగా తీర్చిదిద్దడమే నా కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ వెంకటయ్య బిజిలి లింగం, వస్కుల శీను గంట మల్లేష్ డ్రైనేజీ కాంట్రాక్టర్ వెంకటేష్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సంస్థ యూనియన్ అనుమతి ఇవ్వాలి

- ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసి అపాయింట్మెంట్ డేట్ ప్రకటించాలని కోరారు
- ఆర్టీసీ జేఏసి ఛైర్మన్ ఈదురు వెంకన్న,వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి

జయభేరి, యాదగిరిగుట్ట :




ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయకపోతే ఈనెల 22 నుంచి ఆర్టీసీ సమ్మెకు వెళ్తామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న,వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో సమస్యలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన బకాయిలు 2021,2025 సంవత్సరం పీఆర్సీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెట్టిందని,కానీ నేటికీ నిర్ణయం ప్రకటించకపోవడం విచారకరమన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను వేలాదిగా ప్రవేశపెట్టి ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్రను వెంటనే మానుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్టీసీని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు యాదయ్య,మంగమ్మ, యాదగిరిగుట్ట డిపో జేఏసీ నాయకులు సోకం వెంకటయ్య, కట్ట కిషోర్ కుమార్, గడ్డం రాజు, అనంతల శ్రీనివాస్ గౌడ్, నరసయ్య, ఎల్లయ్య, రమేష్, నర్సింగ్ రావు, లవయ్య, స్వామి, క్రాంతి, మల్లేష్, గిరి, ఎపి రెడ్డి,జీవన్ రావు, సత్తయ్య, ఏఆర్ రెడ్డి, వివి రెడ్డి, ఠాగూర్, అశోక్, శ్రీనివాస్, అంజయ్య, ప్రకాష్,ఆంజనేయులు, ఇస్తారి,జాకీర్,నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠాపై పోలీస్ శాఖ దాడులు

జయభేరి, పరవాడ:



పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడి కాలనీలో పరవాడ సి.ఐ మల్లికార్జునరావు సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా దాసరి అశోక్ కుమార్ (32 సంవత్సరాలు), తాడి కాలనీ నివాసి, నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ వినియోగించి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో అతను ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ నిర్వహించడంతో పాటు, ఇతరుల నుండి డబ్బులు సేకరించి కూడా బెట్టింగ్ చేయిస్తున్నట్లు వెల్లడైంది అలాగే ఇతను మరికొందరిని కూడా ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌లోకి చేర్చి, వారికి డబ్బులు సంపాదించేలా ప్రోత్సహించినట్లు పోలీస్ శాఖ వారు గుర్తించారు.మొబైల్ ఫోన్ పరిశీలనలో బెట్టింగ్‌కు సంబంధించిన వివరాలు, లావాదేవీలు గుర్తించబడ్డాయి.సుమారు రూ. 2.5 లక్షల పైగా తన ఖాతా నుండి పంపినట్లు కొద్ది రోజుల్లోనే ఆన్లైన్ బెట్టింగ్ నిమిత్తం పెట్టినట్లు పంపినట్లు, అలాగే ఇతరుల నుండి కూడా డబ్బులు స్వీకరించినట్లు తెలియడంతో ఇందుకు సంబంధించిన మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి జరిగిన లావాదేవీలపై పరిశీలన చేస్తున్నారు.

ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులు మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించడం, బెట్టింగ్ ఆడడం రెండూ కూడా చట్టపరంగా నేరమని తదుపరి దర్యాప్తులో బెట్టింగ్ నిర్వహణ మూలాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించబడుతుందని పరవాడ ప్రాంతంలో ఇటువంటి ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై మరింతగా దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసారు. ఈ విషయంపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి

- అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకుభూమి పూజ
- సర్పంచ్ గుమ్మడవెల్లి రవి

జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 14:



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జన్మదినని పురస్కరించుకొని, అంబేద్కర్ జయంతి వేడుకలు వేములపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుమ్మడవెల్లి రవి, పంచాయతీ కార్యదర్శి, మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళవారం ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం సామాజిక న్యాయమే లక్ష్యంగా, అంటరాని తనాన్ని నిర్మూలించడం కోసం అణగారిన కులాల అభ్యున్నతి కోసం, కృషిచేసి, భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహానీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఆయన విదేశాల్లో గొప్ప చదువులు చదివి, ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన మహా నాయకుడు అన్నారు. భారతదేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో లేని గొప్ప అతిపెద్ద రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు రాత్రింబగలు కష్టపడి, 1950 లో భారత రాజ్యాంగాన్ని జనవరి 26 పార్లమెంటులో ఆమోదింపజేసి, రాజ్యాంగ గొప్పతనాన్ని, ప్రపంచ నలుమూలల, చాటి చెప్పిన ఘనుడు అన్నారు. ఇలాంటి రాజ్యాంగ నిర్మాత ఆశయాలను భావితరాల భవిష్యత్తు కోసం ముందుకు తీసుకపోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తదనంతరం సర్పంచ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసన్న వార్డ్ నెంబర్లు, మట్టపల్లి గంగయ్య, చుక్క ఎల్లయ్య మాజీ సర్పంచ్ గుమ్మడవెల్లి పర్శయ్య, అంగన్వాడీ టీచర్, స్వరూప,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిడతపల్లి వెంకన్న, పాల్వాయి బాలయ్య, సోమారపు లింగయ్య, బాబు, మధు, సిపి పర్శయ్య, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్, మంగి సతీష్, గుమ్మడవెల్లి శ్రీకాంత్, గుమ్మడవెల్లి చిన్న వెంకన్న, సుధాకర్ శ్రీను, భాస్కర్, రాజేష్ , చింతకింది వెంకన్న, నవీల ప్రవీణ్, నరసయ్య, ఇరుగు శ్రీకాంత్ గుమ్మడవెల్లి ముత్తయ్య, వీరస్వామి, ప్రవీణ్, రామయ్య, వెంకన్న కాశమల్ల సుధాకర్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

- భూత్పూర్, అమిస్తాపూర్ లలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలు

జయభేరి, దేవరకద్ర :

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ అమిస్తాపూర్ లలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతగానో సంతోషకరంగా ఉందన్నారు. అన్ని వర్గాలకు సమ హక్కులను కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగం రచించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన, చారిత్రాత్మకమైన ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా అమిస్తాపూర్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ పార్కును ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అలాగే భూత్పూర్ పట్టణంలో చలివేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

- వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్

జయభేరి, దేవరకొండ :

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా దేవరకొండ బస్టాండ్ దగ్గర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించడం జరిగింది. దేవరకొండ వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి ఐపీసీలు గోవిందు కొండయ్య బిలీదే మాధవి, వాసవి క్లబ్ కార్యదర్శి బిలీదే రవీందర్ కోశాధికారి పందిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దాట్లలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- సర్పంచ్ కొమినేని మంజుల రవీందర్

జయభేరి, దంతాలపల్లి ఏప్రిల్14 :

మండలం దాట్ల గ్రామంలో డా,బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకల సందర్భంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ (ఎస్సీ కాలనీ) వారి ఆధ్వర్యంలో జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా దాట్ల గ్రామ సర్పంచ్ కొమ్మినేని మంజుల రవీందర్ మరియు గ్రామ ఉపసర్పంచ్ మధు వార్డు మెంబర్స్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, విద్య, పోలీస్ శాఖ అన్ని శాఖల ఉద్యోగులందరూ, గ్రామంలోని పెద్దలు, యువత అందరూ పాల్గొన్నారు.

# ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- కొందరు నాపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆలేరు అభివృద్ధి ఆగదు
- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 :**

ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చి దిద్దుతామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మంగళవారం యాదగిరి గుట్ట మండలంలోని చిన్నకందుకూరు,వంగపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, రాష్ట్ర మహిళా,సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభరాణితో కలిసి డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని,కానీ కొందరు నాపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంత మంది బురద జల్లినా ఆకాశం మీ ఉమ్మి వేసినట్టేనని, ఎన్ని అడ్డంకులు, ఇబ్బందులు పెట్టినా అన్ని పార్టీలను కలుపుకొని అహర్నిశలు కష్టపడి ఆలేరుకు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. గత పదేళ్లుగా నిధులు కొల్లగొట్టి ఆలేరు ప్రజలకు ఏమీ చేయనోళ్లు బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మోత్కుపల్లి నర్సింహులు శిష్యుడిగా డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కోసం కృషి చేస్తానని,ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కృషి వల్లే మనకు ఈ పదవులు వచ్చాయని, ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు.

**చిన్నకందుకూరులో సీసీ రోడ్డు, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..**

యాదగిరిగుట్ట మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో సీసీ రోడ్డు,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మునిసిపల్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మునిసిపల్ కార్యాలయం నందు మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ ఆధ్వర్యంలో డా. బి. ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో వైస్ చైర్మన్ జువేరియా తబసుమ్, కమీషనర్ పూర్ణచందర్ రావు, కౌన్సిలర్లు సుమలత, అంకులమ్మ, సాయి చంద్ర, రూప్ల నాయక్, నవీద్, నాయకులు పున్న వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్, సత్యం, మునిసిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమం, డిపో మేనేజర్ విజయకుమారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని ప్రజలలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. రహదారి భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. ఆర్టీసీ బస్సులలో సురక్షిత ప్రయాణం ఉంటుందని, ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఎంఎఫ్ వెలుగు కృష్ణయ్య, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన దేవరకొండ మండలం BRS పార్టీ అధ్యక్షులు , ప్రముఖ వ్యాపారవేత తాటికొండ వెంకట నారాయణ రెడ్డి(TVN REDDY)శివ లీలా రెడ్డి దంపతుల కుమారుడు తాటికొండ కార్తీక్ రెడ్డి 2025 2026 ఇంటర్ మొదటి సంవత్సర పరీక్ష ఫలితాల్లో ఎం పీ సీ విభాగంలో 468/470 అత్యధిక మార్కులు విద్యార్థి సాధించినాడు ఇంటర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నల్లకుంట బ్రాంచ్ లో విద్యను అభ్యసించి విజయమును సాధించినాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అధ్యాపక బృందం విద్యార్థికి అభినందనలు తెలియజేసినారు. ఈ ఉత్తమ ఫలితాలను సాధించిన కార్తీక్ రెడ్డి కి తల్లిదండ్రులు బంధుమిత్రులు అభినందనలు తెలియజేసినారు.

## బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

- తీదేడు గ్రామంలో ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు
- తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి



**జయభేరి, చింతపల్లి :**

దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు సాధించడంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని మంగళవారం చింతపల్లి మండలం తీదేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రూపుమాపి అందరికీ సమ న్యాయం అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని ఆమె కొనియాడారు.చిన్న రాష్ట్రాల ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్న అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని ఆమె తెలిపారు.నేటితరం యువత అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,సోనగంటి గోవర్ధనాచారి, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్,సందె లక్ష్మయ్య,శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామస్తులు మద్రు రామారావు,సిమర్ల శ్రీను యాదవ్, మద్రు శ్రీనివాస రావు,గంటెల ఆంజనేయులు, సిమర్ల రాములు,వీరమల్ల వెంకటయ్య,గంటెల చంద్రయ్య, మొరుపోజు రాజు, జక్కుల మల్లయ్య, ఇడమోని ఈదయ్య, వలమోని వెంకటయ్య,రెడ్డి వెంకటయ్య,సందె శంకర్, పంబాల చెన్నయ్య,సందె శ్రీశైలం, ఆమనూరి కుమార్, సందె అనిల్,సందె వెంకట్, మునగాల అశోక్,కొన్రెడ్డి రాములు, సందె ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిచెన్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెన్నక్కి తీసుకోవాలి

- ఘనంగా అంబేద్కర్ కి నివాళులర్పించిన సిఐటియు నాయకులు



**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడ బాలికల హాస్టల్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి 135వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్మార్ట్ కిచెన్ లకు మధ్యాహ్నం భోజనం పథకం అప్పగించవద్దని సిఐటియు ఆధ్వర్యంలోవినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని పూర్తిగా భారత రాజ్యాంగ నిర్మాణానికి ఉపయోగించిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగంలో ఇచ్చిన హక్కుల కోసం నేడు కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మధ్యాహ్నం భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే చర్యలు విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. డొక్కా సీతమ్మ వంటి వారి పేరు పెట్టి నేడు పథకాన్ని ప్రైవేటు చేయడం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమన్నారు. పేదపిల్లలకు పెట్టే ఆహారంపై, పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు.స్మార్ట్ కిచెన్లకు ఇవ్వడాన్నిఐక్యంగాఎదుర్కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వ జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం నాయకులు కె. విమల, దేవుడమ్మ, సన్యాసమ్మ, రమణమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో గ్రామ సభ

- ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు




**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరవాడ మండలం వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు మరియు డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జునరావు హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం పంచాయతీ కార్యదర్శి అనురాధ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభలో నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను అనుసరించాలని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రికార్డుల నిర్వహణ, ఎం.బుక్ బిల్లుల చెల్లింపులపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో 12 వార్డులు ఉన్నప్పటికీ ఓటర్ల వివరాలు తారుమారుగా నమోదవుతున్నాయని సమస్యను ప్రస్తావించారు. దీనికి పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

భూముల రీసర్వే దరఖాస్తుల పరిష్కారంపై వి.ఆర్.ఓ రమణ వివరించారు. తాగునీటి సమస్య, జలహారతి పథకం పనులు, చెరువులుకాలువల అభివృద్ధి, నీటి కుళాయిల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. అలాగే పలు బస్ స్టాపుల వద్ద ఆర్టీసీ బస్సులు ఆగకపోవడం సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు , టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, మాజీ వార్డు మెంబెర్స్, గ్రామ పెద్దలు, సచివాలయం, రెవెన్యూ, అంగన్వాడీ, డ్వాక్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం వాడచీపురిపల్లి పంచాయతీ లో భారత రాజ్యాంగ నిర్మాత, మహానేత డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ఎస్.సి కాలనీ లో వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెడ్డం పుష్ప చంద్రరావు , కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికుడు పైల శ్రీనివాసరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు మాత్రమే కాకుండా సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్ముడని కొనియాడారు.

అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు అందరికీ అందేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం జయంతి సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు పైల శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు,పరవాడ మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, పెందుర్తి నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్ చరణ్ రాజ్, మాజీ పి.ఏ.సి.ఎస్ చైర్మన్ బురద రాజు, వై.సి.పి నాయకులు బొంది అచ్చిబాబు, బండి ముత్యాలు, మసవరపు అప్పారావు, జమ్ముల అశోక్,శివలంక నరసింగరావు,శివలంక గౌతమ్, బల్ల రమణ, ఎస్.రమేష్, ఎం.రమేష్, ఎస్.సుధీర్, ఎస్.అప్పలరాజు, ఎస్.సీతయ్య, ఎన్. ఈశ్వరరావు, ఎన్. రవి, ఓ.అప్పారావు, ఎస్.లక్ష్మణ్, ఎస్.సన్నిబాబు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా అధ్యక్షుడు NVT, సభ్యులతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించిన భీమ్‌రావు చిన్నప్పటి నుంచే కుల వివక్షను అత్యంత దారుణంగా ఎదుర్కొన్నారని, పాఠశాలలో తోటి విద్యార్థులతో సమానంగా కూర్చునే అవకాశం లేకపోయినా, చదువు ద్వారానే తన జీవితాన్ని సమాజాన్ని మార్చగలనని ఆయన బలంగా నమ్మారు. ఆ పట్టుదలే ఆయనను ఉన్నత విద్య వైపు నడిపించింది.కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులను అధిగమించి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించిన తొలి తరం భారతీయుల్లో ఆయన ఒకరు. విదేశీ గడ్డపై పొందిన జ్ఞానం, అక్కడ ఎదురైన అనుభవాలు ఆయనను సామాజిక మార్పు కోసం పోరాడేలా పురికొల్పాయి. అంటరానితనం, కుల వివక్ష లేని సమాజం కోసం ఆయన చేసిన కృషి నిరుపమానం. భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన పాత్ర అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, బత్తుల అమర్ ,వైయస్ కరుణాకర్, తాళ్ల సురేష్ ,వలమల్ల ఆంజనేయులు, పున్న బోయిన సైదులు, సన్నీ, కంబాలపల్లి వెంకటయ్య, రమేష్, శ్రీనివాస్ యాదవ్, జగదీశ్వర్ ఆచారి, జమీర్, రాజేష్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్న దేవరకద్ర విద్యార్థిని వడ్ల నిత్య

- వడ్ల నిత్యను అభినందించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి చెందిన దేవరకద్ర పట్టణ జర్నలిస్టు సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్ చారి,మాధురి దంపతుల కూతురు వడ్ల నిత్య మంగళవారం హైదరాబాద్ బాద్ లో రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంది. విద్యార్థిని నిత్య మహబూబ్ నగర్ లోని సంస్కార్ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. అయితే ఇటీవల హైదరాబాద్ లో అభ్యాస అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు నిత్య పాల్గొని రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి సాధించింది. దీంతో వడ్ల నిత్యకు హైదరాబాద్ లో ఈ రాష్ట్రస్థాయి అవార్డును అందజేశారు. రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న విద్యార్థి నిత్యను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు దేవరకద్ర పట్టణ ప్రజలు అభినందించారు.



## నేడు అనిత ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

జయభేరి, పరవాడ:

మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్ కూడలిలో అనిత ఆప్టికల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ కే. గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ అండ్ అనిత ఆప్టికల్స్, టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని డాక్టర్ కె.గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరుగునని, శుక్లము ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలను కటారాక్టు శాస్త్ర చికిత్స (లెన్స్) అమ్మర్చి ఆపరేషన్ ఉచితంగా చేయబడునని తెలియజేశారు. వైద్య శిబిరానికి వచ్చేవారు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సదావకాశాన్ని పరవాడ పరిసర గ్రామ ప్రజలంతా నియోగించుకోవాలని ఆయన కోరారు.

## శామీర్ పేట్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన - సీనియర్ ఉద్యమ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్




జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :

శామీర్ పేట్ లో రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమ నాయకులు, కాంగ్రెస్ నేత మహ్మద్ అఫ్జల్ ఖాన్ పాల్గొని అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు అంబేద్కర్ ఆశయాలు కొనసాగించి దేశాభివృద్ధికి దోహదం కావాలని కోరారు. అంబేద్కర్ గారి రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుం దని ఆయన పేర్కొన్నారు. యువత అంబేద్కర్ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్ల రమేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు ఉప్పలయ్య, నాయకులు పి నర్సింహా రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి వేణుగోపాల్ ,అబ్దుల్ రహీం, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించిన - కౌన్సిలర్ స్వప్న రాంప్రసాద్ గౌడ్

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 15వ వార్డు కౌన్సిలర్ స్వప్న రాంప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు గాను తన వంతుగా 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ ఆలోచన విధానంతో మన హక్కులు కల్పించాడని, అంబేద్కర్ స్ఫూర్తితో అందరూ దేశాభివృద్ధికి కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కౌకుంట్లలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- నివాళులు అర్పించిన సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్లలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ మాట్లాడుతు సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన సేవలు దేశానికి చిరస్మరణీయమని అని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, వార్డు సభ్యులు సురేందర్,బంటునాగన్, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు,గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## బోయిన్ పల్లిలో అంబేద్కర్ జయంతి

- పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

జయభేరి, సికింద్రాబాద్ :

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బోయినపల్లి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడిగా అంబేద్కర్ చరిత్రలో నిలిచారని దేశ ప్రజలందరికీ ఆయన ఆదర్శ ప్రాయుడని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మూలంగా బడుగు బలహీన అణగారిన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అంబేద్కర్ వారసత్వాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు.

# ఆర్టీఏ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ - అలైవ్ కార్యక్రమం

- గ్రామస్థాయి నుండి రహదారి భద్రత వ్యవస్థను బలోపేతం చేయాలి - భీమిడి జైపాల్ రెడ్డి

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా.రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఆర్టీఏ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు జరుగుతున్న ఈ అవగాహన వారోత్సవాల సందర్భంగా, మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్, దేవరయాంజాల్ గ్రామంలో ఆర్టీఏ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి తన ప్రాణం ఎంతో విలువైనదని, అయితే మనం చేసే నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు .కేవలం నిబంధనలు అమలు చేయడం మాత్రమే కాకుండా,ప్రజల్లో అవగాహన, ప్రవర్తనలో మార్పు వచ్చినప్పుడే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు.అతివేగం, హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ లో డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వంటి నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రమాదాల నివారణ కోసం ఆర్టీఏ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేసి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పేండం లక్ష్మినారాయణ, జిల్లా దళిత సమైక్య అధ్యక్షులు బి.ఎన్. రామ్మోహన్, రామాలయం మాజీ ధర్మకర్తలు నానిగళ్ళ హరిగోపాల్, వలందాసు మురళి గౌడ్, పట్నం నర్సింహా రెడ్డి, బక్కొల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, సుతారిగూడెం దుర్గయ్య, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, నాయకులు గడ్డమిది జనార్దన్, బక్కొల నర్సింగ్ రావు, మిర్యాలకర్ సాయికుమార్, కట్ట సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

- అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్న - ఎంపీ ఈటల

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :



అగ్ని ప్రమాదాల నివారణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శామీర్‌పేట్‌లో జాతీయ అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు.
ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు అనుకోకుండా సంభవించే విపత్తులలో ఒకటని, వాటి నివారణకు ముందస్తు జాగ్రత్తలు అత్యంత ముఖ్యమని తెలిపారు.
అగ్నిమాపక వారోత్సవాల నిర్వహణ ద్వారా ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే విధానాలపై అవగాహన కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వారోత్సవాలను సద్వినియోగం చేసుకుని అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం శామీర్‌పేట్ ఫైర్ స్టేషన్‌కు చెందిన ఫైర్ ఆఫీసర్ ఎస్. శివప్రసాద్, ఫైర్ ఫైటర్ నాగిరెడ్డిలు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబై ఓడరేవులో జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని స్మరించుకున్నారు.
ఆ ఘటనలో ప్రాణత్యాగం చేసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులు అర్పిస్తూ, వారి సేవలు దేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.
ఈ వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, గృహాల్లో, కార్యాలయాల్లో పాటించాల్సిన భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసిన దళిత సంఘాల నేతలు

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి భూమిపూజ ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు టి. నరేందర్ గౌడ్, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రాములు గౌడ్, లు ముఖ్య అతిథులగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు దేశానికి అందించిన రాజ్యాంగం సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి రావాలని, ముఖ్యంగా యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహ స్థాపనతో యువతలో చైతన్యం పెంపొందడమే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల అవగాహన మరింత విస్తరిస్తుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఈ విగ్రహం ఒక చిహ్నంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, 24వ వార్డు కౌన్సిలర్ మాధవి భుమేష్ గౌడ్, కేశవరం గ్రామ సర్పంచ్ జ్యోతి బలరాం గౌడ్, 20 వ వార్డు కంటెస్టెంట్ కౌన్సిలర్ బొమ్మలపల్లి చిత్తారి యాదవ్ , కృష్ణగౌడ్, యూసుఫ్ అంబేద్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా ఆర్టీఏ సభ్యులు - భీమిడి జైపాల్ రెడ్డి
- అంబేద్కర్ ఆశయ సాధనకు కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపు

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 14 :



సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అంబేద్కర్ అని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్,శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిడి జైపాల్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ గారి సేవలు,సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను స్మరించుకున్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పేండం లక్ష్మినారాయణ, జిల్లా దళిత సమైక్య అధ్యక్షులు బి.ఎన్. రామ్మోహన్, రామాలయం మాజీ ధర్మకర్తలు నానిగళ్ళ హరిగోపాల్, వలందాసు మురళి గౌడ్, పట్నం నర్సింహా రెడ్డి, బక్కొల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, సుతారిగూడెం దుర్గయ్య, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, ఆర్టీఏ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, నాయకులు గడ్డమీది జనార్ధన్, బక్కొల నర్సింగ్ రావు, మిర్యాలకర్ సాయి కుమార్, కట్ట సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ, జయంతి వేడుకలు

జయభేరి, హుస్నాబాద్ ఏప్రిల్ 14 :

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కనపేట మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా దేశ గమనాన్ని మార్చిన అంబేద్కర్ విజ్ఞానానికి, పోరాటానికి నిలువెత్తు రూపంఅని అన్నారు.సమాజంలోని అసమానతలను రూపుమాపి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయని, అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ, అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందిస్తూ నవ భారత నిర్మాణానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందన్నారు.
ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్ మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్ మడక రవికుమార్ చౌడు తండా ఉపసర్పంచ్ అర్జున్ నాయక్ బిజెపి సీనియర్ నాయకులు మోహన్ నాయక్ జంగపల్లి శ్రీనివాస్ చందుపట్ల నాగరాజు. తీగుల చంద్రం కొండ్ల సంజీవరెడ్డి జన్నారపు కళ్యాణ్. బత్తిని జీవన్, గిరిమల్ల రాజు,ఇటీకాల రాజశేఖర్, వేముల శ్రీనివాస్,రాజు,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

జయభేరి, దేవరకద్ర :

నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్ద చింతకుంట లో మంగళవారం అంబేద్కర్ విగ్రహాన్ని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తమ స్వగ్రామమైన పెద్ద చింతకుంటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, సంఘసంస్కర్తగా, దళితుల ఆశాజ్యోతి గా అంబేద్కర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఆయన జీవితం ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయంగా ఉన్నా అన్నారు. దేశ సమైక్యత, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని సాధించే దిశగా అందరు కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పిలుపునిచ్చారు. ఈ విగ్రహ స్థాపన గ్రామ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం నియోజకవర్గంలోని చిన్నచింతకుంట, కౌకుంట్ల, భూత్పూర్ మండలాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 8 గంటలకు చిన్నచింతకుంట మండలం నెల్లికొండిలో ఐకెపి ఆధ్వర్యంలో, పిఎసిఎస్ ఆధ్వర్యంలో పల్లమర్రి,పర్దిపూర్ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. అలాగే పార్దిపూర్, గోప్యానాయక్ తండాలలో విద్యుత్ సమస్యను తీర్చడానికి ఇటీవల మంజూరు చేసిన 8 ట్రాన్స్ ఫార్మర్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. 10 గంటలకు కౌకుంట్ల మండల కేంద్రంలో మరియు అప్పంపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. 11:30 గంటలకు భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరవుతున్నారు. కావున ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## దళిత మహిళను దూషించిన టీడీపీ నేతలు

జయభేరి, అనంతపురం :

వైసీపీ దళిత మహిళా నేత మంజులను టీడీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషించారు. అనంతపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఘటన జరిగింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా పూల మాలలు వేసేందుకు వైసీపీ నేతలు వెళ్లారు. టీడీపీ నేతలు దూషించటంతో వైసీపీ మహిళా నేత మంజుల కంట తడిపెట్టింది. టీడీపీ నేతల తీరుపై వైసీపీ నేతలు నిరసన తెలిపారు.

# నెట్టింట గత్తరలేపుతున్న యాంకరమ్మ..



స్రవంతి కెరీర్ ప్రారంభంలో రాజశేఖర్ నటించిన 'మహంకాళి' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలు పోషించారు. అయితే, వివాహం తర్వాత ఆమె ఇండస్ట్రీకి దూరమయ్యారు. కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో, ఆమె ఒక జ్యూయెలరీ షాపులో సేల్స్ గర్ల్ గా కూడా పని చేశారు. గంటల కొద్దీ నిలబడటం కష్టమైనప్పటికీ కుటుంబం కోసం ఆ పనిని కొనసాగించారు. ఆర్థిక పరిస్థితులే ఆమెను తిరిగి ఇండస్ట్రీ వైపు నడిపించాయి. ఈసారి నటిగా కాకుండా యాంకర్ గా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. తన వాక్చాతుర్యంతో అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా తెలుగు రియాలిటీ షో 'బిగ్ బాస్' లో రెండుసార్లు పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ సినిమా వేడుక జరిగినా స్రవంతి ఉండాల్సిందే అన్నంతగా ఆమె బిజీ అయిపోయారు. కేవలం యాంకరింగ్ కే పరిమితం కాకుండా, స్రవంతి ఇప్పుడు నటిగా కూడా రాణిస్తున్నారు. ఇటీవల సుహాస్ నటించిన హే బలవంత్ సినిమాలో ముఖ్య పాత్ర పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఒక సాదాసీదా అమ్మాయి నుంచి, సేల్స్ గర్ల్ గా పనిచేసి, నేడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ యాంకర్ గా ఎదగడం వెనుక స్రవంతి పడ్డ కష్టం అపారం.



# అఖిల్ ‘లెనిన్’ నుంచి సెకండ్ సింగిల్..
# ‘ఎట్టా ఎట్టా’ రిలీజ్ డేట్ ఫిక్స్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ ‘లెనిన్’ నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ ‘ఎట్టా ఎట్టా’ వీడియో సాంగ్‌ను ఏప్రిల్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, వంశీ ఐరటనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# జననాయగన్ నిర్మాతలతో మరో సినిమా?



తమిళ అగ్ర హీరో విజయ్ ‘జననాయగన్’ సినిమాకు సంబంధించిన వ్యవహారం రోజుకో మలుపు తీసుకుంటున్నది. ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదలపై ఇంకా క్లారిటీ రాలేదు. ఈ లోపే సోషల్‌మీడియాలో సినిమా లీక్ కావడం చిత్ర నిర్మాతలనే కాక, యావత్ సినీలోకాన్నే షాక్‌కి గురి చేసింది. ఇది చాలదన్నట్టు ఈ సినిమా మొత్తాన్ని కోయంబత్తూరులోని ఓ లోకల్ ఛానల్ ప్రసారం చేసింది. దాంతో చిత్రయూనిట్ దిగ్భ్రాంతికి లోనైంది. ఈ వ్యవహారంపై సైబర్ క్రైమ్ పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేయడంతోపాటు సదరు ఛానల్ యజమానిని సైతం కస్టడీలోకి తీసుకున్నారు. ఇదిలావుంటే.. ‘జగనాయగన్’ విషయంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థకు జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని.. సదరు సంస్థతో మరో సినిమా చేయాలని విజయ్ నిర్ణయించారట. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కాగానే ఈ సినిమా పని మొదలుపెట్టాలని విజయ్ భావిస్తున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

# ఏమి లేనప్పుడు నాకు అండగా నిలిచింది..
# భార్యపై కిరణ్ అబ్బవరం ఎమోషనల్ కామెంట్స్



తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు కిరణ్ అబ్బవరం. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఇటీవల జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. “ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం” అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్త వారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు.

అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది.

నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా మ్యూజిక్, సౌండ్ డిజైన్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని, ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకు సినిమా ఆకట్టుకునేలా ఉంటుందని చెప్పారు.ఇంకా ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం విశేషం.

# ఇప్పుడు మళ్లీ వార్తల్లో..

నివేదా మళ్లీ తన సినీ కెరీర్‌పై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాబోయే భర్త కోసం సినిమాలను పక్కన పెట్టిన ఆమె, ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. హీరోయిన్ పాత్రలతో పాటు, కీలకమైన సపోర్టింగ్ రోల్స్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. నటిగా వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడంలో ఎప్పుడూ ముందుండే నివేదా, ఈసారి మరింత బలమైన కథలతో ప్రేక్షకుల ముందుకు రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2017లో మెంటల్ మదిలో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నివేదా, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత చిత్రలహరి, బ్రోచేవారెవరురా సినిమాలతో నటిగా తన ప్రతిభను చాటుకుంది. అలాగే అల వైకుంఠపురములోలో కీలక పాత్ర పోషించి మెప్పించిన ఆమె, రెడ్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించి మరో కోణాన్ని చూపించింది. బ్లడీ మేరీలో టైటిల్ రోల్, దాస్ కా ధమ్కీలో నటనతో మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల ZEE5లో విడుదలైన ‘పరువు’ వెబ్ సిరీస్‌లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. కేవలం నటనలోనే కాకుండా, ప్రొఫెషనల్ కార్ రేసింగ్‌లో కూడా తన ప్రతిభను చూపించిన నివేదా, మల్టీ టాలెంటెడ్‌గా పేరు తెచ్చుకుంది. వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను పక్కన పెట్టి, మళ్లీ సినిమాల్లో బిజీ కావడానికి సిద్ధమవుతున్న నివేదా పేతురాజ్ సెకండ్ ఇన్నింగ్స్ ఎలా ఉండబోతుందో అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**